

# చేపలు

– కిరణ్మయి

"సంగతేమిటంటే...." విషయం మొదలు పెట్టబోతున్నాడు, జగదీష్. ఏదైనా చెప్పాలన్నా తాపత్రయం పెరిగినప్పుడు చేతులు రెండూ రుద్దుకుంటాడు. ఆ చేతి వేళ్ళు, ఈ చేతివేళ్ళు ఒక దాన్లోంచి మరొకటి దగ్గరకు చేర్చి, గడ్డం కిందగా, గుండెలకు దగ్గరగా పెట్టుకుని ప్రవహించే వాగులో కదిలే చేపపిల్లల్లాంటి కళ్ళతో, విషయం చెబుతాడు. ఆ ప్రవాహం అతని ఆలోచనలే. అందులో ఒకోసారి బెదురుతూ, ఒకోసారి గెంతులేస్తూ ఉంటాయి చేపపిల్లలు.

"నేను చెప్పినట్టుగానే రవి భోజనం చెయ్యడం మానేశాడు. అనుకున్నట్టుగానే గడ్డం కూడా పెంచుతున్నాడు. చెంపలు లోతుగా పోయాయి. ఎలాపడితే అలా ఉన్నాడు".

"ఎందుకుట...."

"ఇంట్లో గొడవలు. వాడి నాన్న వీడి చదువు గురించి ఖాతరు చెయ్యడుట. వాళ్ళ అమ్మ అప్పుడప్పుడు డబ్బు సాయం చేస్తుందట. వీడికి అది ఇష్టం లేదుట. ఆవిడ ఏడుస్తూ ఉత్తరాలు రాస్తుందిట. వీడు ఎవడికి రాయడట."

ఇన్ని ఇంటి విషయాలు ఎలా తెలుస్తాయో!

"నేననుకున్నానూ వాడితో తిరుగుతున్న అమ్మాయి, ఎవ్వైనా..."


నాకు చేపపిల్లలు నిశ్శబ్దంగా, గోలగా అరుస్తున్నట్లనిపించింది. జగదీష్ మనసులో ఆలోచనలు ఎలా పరుగెడుతుంటాయో ఊహించొచ్చు.

ఈ మధ్య మా యూనివర్సిటీలో విడిపోయే జంటలు పెరుగుతున్నాయి. ఆ మాట కొస్తే కలిసే జంటలూ పెరుగుతున్నాయి. కానీ కలిసే జంటలు విడిపోని బంధాలుగా కొనసాగుతాయనేది స్థూలమైన, ప్రపంచం నమ్మే అభిప్రాయం.

కదుల్తున్న చేపపిల్లల్ని చూస్తూ చెఱువు ఒడ్డున గాలిని తూస్తున్న చెట్టులా నిలబడి ఊహిస్తున్నాను.

రేఖ, రవి విడిపోతారేమో అని జగదీష్ కోరిక. అలా జరగాలని ఏమీ లేదు. ఇద్దరూ విభిన్నంగా ఉండే వ్యక్తులు. నాకు రవితో పరిచయం పుస్తకాలు, లిటరరీ అసోసియేషన్ కార్యకలాపాలతో ఏర్పడింది. ఎక్కువ మాట్లాడడు. అందర్నీ చాలా జాగ్రత్తగా గమనిస్తాడు. అనవసరమైన హడావుడి సూత్రాలు వల్లించడు. రేఖ చిరునవ్వు చాలా అందమయింది. మనిషి మాత్రం అందంగా ఉండనా, వద్దా అని ఆగిపోయినట్టుంటుంది. దీన్నే సొగసంటారేమో! నాకు మాత్రం దిగులుతో మెరుస్తున్న రెండు వేరు వేరు చేపల్లా కనిపిస్తారు, ఇద్దరూ.

జగదీష్ కళ్ళు నాకళ్ళ దగ్గర ఆగాయి. "ఆ అమ్మాయి వాడ్ని వదిలేస్తుందంటే నీకెందుకు బాధ"!




ఎందుకు బాధ కాదు?

"రవికి ప్రేమించే టెంపరమెంట్ తక్కువ అని నాకనిపిస్తుంది. ఊరికే ఆ అమ్మాయిని వెంటేసుకు తిరిగితే ఆమె ప్రేమను పొందే స్తాడా? ఆ అమ్మాయి ఏదో వీడి ఫిలసాఫికల్ ముఖాన్ని, గంభీరత్వాన్ని చూసి ముచ్చట పడుతోందనిపిస్తుంది. అలా నాలుగైదుసార్లు బయటకి వెళ్ళి వస్తే వాడి దిగులు, ఏడుపు అర్థం చేసుకోవడం మొదలు పెడితే విసుగురావడం ఖాయం. ఇంకా తనుగాబట్టి ఇంతకాలం తట్టుకుంది. ఏదో ఓ రోజు వది లేస్తుంది".

"ఏమో, నాకైతే అలా అనిపించట్లేదు. అయినా అంత ఖచ్చితంగా ఎలా చెప్తావు?

"నాకు తెలుసు. అది అంతే."

అలాంటిదేమి జరగాల్సిన అవసరం లేదు. రవి ఎక్కువ జనంలోకి రాడు. జగదీష్ జనంలో బాగా కలిసే మనిషి. ఎప్పుడు చూసినా అతని పెదవులు కదులుతూ ఉంటాయి. కళ్ళు అటూ ఇటూ తిరుగుతూ చెదురుతూ ఉం టాయి. నాకు జగదీష్ అంటే ఇష్టం. ఇంత మాట్లాడినా అవీ ఇవీ చెప్పినా నా అంతరంగం అతనికి తెలీదు, అతని సుఖదుఃఖాలు నాకు అర్థం కావు. నీళ్ళ తొట్టిలో ఊరికే దగ్గరకు చేరి మాట్లాడుకు పక్కకు వెళ్ళిపోయే చేపల్లాంటి వాళ్ళం మేమిద్దరం.

ఇప్పుడు రవి జీవితం మీద పెద్ద రీసెర్చ్ చేస్తున్నాడు జగదీష్. అతనికి కావలసిన నిజాలు (దొరికినా, దొరక్కపోయినా) దొరకపుచ్చుకోవాలనుకుంటున్నాడు. రవి అంటే ఏదో సింపతీ ఉండీ, సహాయం చేద్దామని కాదు. రేఖలాంటి అమ్మాయి అతని వెనక పడటం జగదీష్‌కు బాగా లేదు. హృదయం బద్దలైతే ఏమైనా అఘాయిత్యం చేసుకుంటుందేమో!

తను ఆశించినట్టు నేను మాట్లాడక పోవడం జగదీష్‌కి బాధ కలిగించినట్టుంది. అయినా, తన నోట్లోంచి వచ్చిన మాటలను అవే తూకంలో తూచి ఎవరు మంచి ఎవరు చెడ్డ అన్నది నిర్ణయించాలంటే ఎలా సాధ్యం! ఇద్దరు వ్యక్తుల్ని అర్థం చేసుకోవడమంటే రెండు చేపల మధ్య తిరిగే నీరులా ఉండడమే! అది ఎంత లోతు, ఎంత చల్లగా ఉంది అన్నది ఆ చేపలకే తెలుస్తుంది.

రవి ఒక్కడే చెట్టుకింద కూర్చుని ఉన్నాడు. లైబ్రరీ నుంచి తీసుకొస్తున్న పుస్తకాల బరువు ఎక్కువగా ఉంది. ఆగి, ఒక క్షణం పలకరించి పోదామనిపించింది.

"ఇన్ని పుస్తకాలు మోసి తీసుకుపోవడమే కష్టంగా అనిపిస్తోంది. వాటిని చదవడానికి ఎంత కాలం పడుతుందో అని అదో భయం"!

నా మాటలకి నవ్వుతూ చేతిలోని పుస్తకాలు అందుకున్నాడు. పేజీలు తిరగే స్తుంటే అతన్నే చూస్తూ తరవాత మాటల కోసం ఎదురు చూస్తున్నాను.

"పుస్తకాల బరువుని ఎక్కువ అనుకుం టాం కదా! చదివిన తర్వాత మెదడు బరువెక్కుతుందంటారా?"

తొమ్మిదో క్లాసు పిల్లాడిలా అడిగాడని పించింది.

"బరువు సంగతి నాకు తెలీదు గానీ, భయం మాత్రం పెరుగుతుంది, నా వరకు నాకు. అదే ఒక విధమైన బరువేమో ! ఆ లెఖ్ఖన ఎన్నెన్ని కిలోలు మోస్తున్నామో మనం ! హాయిగా ఆలోచించేందుకు వీల్లేకుండా సంకెళ్ళు పడిపోతుంటాయి. వాటిని విడిపించు కోవాలని ప్రయత్నిస్తూ, మార్గాల కోసం వెతుకుతుంటే కొత్త పుస్తకాలు కనిపిస్తాయి, సంకెళ్ళు ఇంకా పెరుగుతాయి. అలా అని చదవకుండా ఉండలేం." - ఆగాను.

గడ్డిపరకలు తుంచుతూ, నా మాటలు గురించి నేనే ఆలోచిస్తున్నాను. అతను కొద్దిసేపు నిశ్శబ్దంగా పుస్తకాలమీద పేర్లు చూసి, "మీరు ఎక్కువ చదువుతారనుకుంట".

"అలా అనేం లేదు. కొన్ని రీసెర్చ్‌కి కావలసినవి, కొన్ని చదవాలనిపించినవి, అంతే. ఒక్కో పుస్తకం చదవటానికి చాలా టైమ్ తీసుకుంటాను. ఎటొచ్చీ, ఎక్కువ రకాల పుస్తకాలు చదవటానికి ప్రయత్ని స్తుంటాను."

"మీలాంటి వాళ్ళను చూసినప్పుడల్లా నాకు కొంచెం భయం కలుగుతుంటుంది. అవీ, ఇవీ చదివి జీవితాన్ని అర్థం చేసుకోవడం సాధ్యమేమోకానీ, అనుభవించడం సాధ్యం కాదు. ఎప్పుడైతే మీరు అనుభవించడం మొదలెడతారో మెదడు బరువు తగ్గి, తేలికగా అనిపిస్తుంది. రేఖతో కూడా నేను అదే చెబుతూ ఉంటాను. కానీ వినదు. పుస్తకాలు చదవటం తెలివితేటలకి, విజ్ఞతకి చిహ్నం అనుకుంటుంది. నేను కాదనను. కానీ దీనికి అతీతంగా జీవితం ఉందని మర్చిపో తుంటారు.'

అతని చెంపల నుంచి కళ్ళను చూస్తూ నిద్రపోతున్న నీటి బుగ్గల్ని గుర్తు చేసు కున్నాను.'

"పుస్తకాల ద్వేషిగా మిమ్మల్ని ఊహించ లేకపోతున్నాను. మీ దృష్టిలో ఎలాంటి అనుభవాలు ముఖ్యం?"

"మీరెప్పుడైనా మన యూనివర్సిటీలో ఉండే చిన్న చిన్న నీటి గుంటల దగ్గరికి వెళ్ళారా? అందులో తిరిగే చేపల్ని చూశారా? ఒడ్డున నిలబడి చూస్తున్న మీకు, అందులో తిరిగే చేపకూ ఏవైనా సంబంధాన్ని చూశారా? నాకైతే 100 పేజీల పుస్తకం కంటే ఆ అనుభవం ఎక్కువ విలువైనదిగా అనిపిస్తుంది".

అతను మరీ పల్లెటూరి వాడిలా ఆలోచిస్తున్నాడనిపించింది నాకు.

"నిజమే. అనుభవం ముఖ్యమే. కానీ ఒకోసారి ఈ అనుభవాలు నీటి మీద కెరటాల్లా వెళ్ళిపోతూ ఉంటాయి. వాటిని చూస్తూ, వాటి గురించి ఆలోచించి అర్థం చేసుకునే లోపలే వెళ్ళిపోతుంటాయి. పైగా ఒక్కోసారి మామూలుగా జరిగిన విషయం కూడా చాలా బాధ పెడుతుంది ఎందుకు? మీలాంటి వాళ్ళు సమాధానం దొరకపుచ్చుకుంటారు. ఆత్మ పరిశీలన ఉన్నవాళ్ళు, ఆలోచించే వాళ్ళు ఉండటం వలన. కానీ పుస్తకాలు కొద్దో, గొప్పో సాయం చేస్తాయి. సాహిత్యం విషయమే




తీసుకోండి. ఎన్నో అనుభవాలు! ఎంతమంది రచయితలు మధనపడి రాసుంటారు?"

నేను ఆవేశంగా పుస్తక సంస్కృతిని వెనకేసుకొచ్చాను. అంతకు ముందే పుస్తకాలు సంకెళ్ళు వేస్తాయి అన్న మాటను మర్చిపోయాను. ఆవేశం చల్లారుతుండగానే నాకు దాని విషయం గుర్తొచ్చింది. వెంటనే అనేశాను - "మీరు చెప్పేది బహుశ గొప్ప అనుభవాలను గురించి - నేను మామూలు అనుభవాల గురించి, మామూలు మనుషుల గురించి, వారు అర్ధం చేసుకోగలిగే శక్తి సామర్ధ్యాల గురించీ మాట్లాడుతున్నాను." అన్నాను.

"మీరన్న మాట తప్పేం కాదు. కానీ అనుభవాలలో గొప్ప, బీద అన్న మార్పు ఉండదనుకుంటాను. మీ ఉద్దేశంలో 'గొప్ప' అంటే ఏమిటి?"

ఒళ్ళోని పుస్తకాలను పక్కకు పెడుతూ నావైపు తిరిగి అడిగాడు. జగదీష్ చెప్పింది నిజమే! బాగా పీక్కుపోయాడు. మాసిపోయిన బట్టల్ని చుట్టి అవతల పారేస్తే ఎలా ఉంటాయో అలా ఉన్నాడు. గొప్ప అనుభవంఅంటే -?

"నా ఉద్దేశం ప్రకారం - చాలా చిన్న విషయంలా కనిపించి, తీవ్రమైన అశాంతికి గురిచేసి, కారణాలు వెతికినప్పుడు, ప్రపంచం నమ్మే స్థూలమైన అభిప్రాయాలకు భిన్నంగా 'నిజం' కనిపిస్తే అది గొప్ప అనుభవమనుకుంటాను."

నా మాటలు విన్నాడు. చిక్కని చెట్టుకొమ్మల మధ్యలోంచి మధ్యాహ్నం ఎండ నేలమీదపడి చేపల్లా గంతులేస్తుంది. మేమిద్దరం కలవకుండా వెళ్ళిపోతున్న రెండు నదీపాయల్లా నిశ్శబ్దంగా ఉన్నాం.

"మీలాంటి వాళ్ళు గొప్ప అనుభవాల కోసం ఎదురుచూస్తారు కాబోలు -! వాటిని పుస్తకాల సాయంతో అర్థం చేసుకుంటారు. నాకు ప్రతి అనుభవం ముఖ్యమనే అనిపిస్తుంది. ఉదాహరణకు నా పరిస్థితీ తీసుకోండి. రేఖకి రెండు రోజుల్నించి ఒంట్లో బాగా ఉండట్లేదు. ఇంతదూరం నడిచివచ్చి కలవలేనని అంటోంది. నేనే వెళ్దామంటే నా సైకిల్ పాడయిపోయింది. చిన్న accident లా అయి, నా కాలు దెబ్బ తగిలి పోటు పెడుతోంది. నడవడానికి వీల్లేని పరిస్థితి. ఒకటే యూనివర్సిటీలో ఉంటూ కలవలేం.... ఫోనలలో మాట్లాడుకుంటున్నామనుకోండి ! దీన్ని మీరు ఎలాంటి అనుభవమంటారు?

"గొప్ప అనుభవమే!" నవ్వేశాను.

"నవ్వకండి. నిజంగా చిన్న విషయమే! కానీ ఈ 'లోటు' గత రెండు రోజులుగా చాలా పెద్ద విషయంగా కనిపిస్తుంది. ఈ రెండు రోజుల్లోనూ ఏ పుస్తకం కూడా నాకు శాంతి నివ్వలేకపోయింది."

"ఇలాంటివి జీవితంలో అనుభవ రూపంలో రావలసినవే కానీ పుస్తకాలు చదివి నేర్చుకోనూ లేం, ఆనందించనూ లేం. వీటి కోసం పుస్తకాల దగ్గరికి వెళ్ళమనను."

"కానీ ఇలాంటి అనుభవాల కోసం కూడా పుస్తకాల దగ్గరికి వెళ్ళే మనుషులు ఉంటారు. అవి చాలా సీరియస్‌గా చదివి, అసలు అనుభవాన్ని అవహేళనగా చూస్తారు. చాలా అసహ్యమేస్తుంది అలాంటి వాళ్ళను చూస్తే."

రవి మాట్లాడినంతసేపూ, ఆ తర్వాత నేను ఈ విషయాలే ఆలోచిస్తూ ఉండిపోయాను.

☆ ☆ ☆

జగదీష్ రవి గురించి విన్న విషయాలు, నాకు చెబుతున్నవి నిజంకి ఎంత దూరం ఉన్నాయో! రవి పీక్కుపోయినట్టు కనిపించడానికి ఇంట్లో చాలా గొడవలే జరుగుతూ ఉండాలా? పిచ్చి కాకపోతే! ప్రతి చిన్న విషయాన్నీ, అనుభవాన్నీ చదువుతూ, పరీక్ష పెట్టుకుంటూ వెళ్ళే రవి లాంటి వాళ్ళకి మనశ్శాంతి కరువవుతుందంటే కరువవదూ! మొన్న రెండు రోజులూ ముఖం పీక్కుపోవడానికి కారణం ఇదన్న మాట. పాపం, జగదీష్ ఏదేదో ఊహించుకుంటున్నాడు.

ఎదురుగా జగదీష్ వస్తూ కనిపించాడు.

"నీకో విషయం తెలుసా! రవి, రేఖ రెండు రోజులుగా కలుసుకోవట్లేదుట, నా ఊహ నిజమయింది. నేను చెప్పలేదూ!"

"అవును"

"అసలు ఇలాంటి విషయాలు కనుక్కోవడం పెద్ద కష్టం కాదు. రవి ఒట్టి ఫూల్! రేఖకు ఒంట్లో బాగా లేదంటే కనీసం వెళ్ళి చూడను కూడ చూడలేదట. ఎంత కోపం ఉన్నా మరీ ఇంత ఘోరంగా ప్రవర్తిస్తారా? చెప్పుకోవడానికి ఏవో వంకలు ! ప్రేమించే అమ్మాయి పట్ల ఇదేనా ఉండాల్సిన తీరు ! నా కొక్కోసారి రేఖను చూస్తే భలే ఆశ్చర్యం వేస్తుంది. ఎంత ఓర్పు, ఎంత సహనం!"

సూటిగా జగదీష్ వైపు చూశాను.

"వాళ్ళిద్దరూ కలవకపోవడానికి కారణం వేరే ఏదైనా ఉందేమో!" అతన్ని చూస్తే ఎందుకో బావి గుర్తొచ్చింది నాకు.

"ఇలాంటి విషయాల్లో వేరే ఏమీ ఉండదు. విడిపోవడమంటే ఇంక విడిపోవడమే!"

"ఏదైతే అదే అవుతుందిలే" అనేసి కాంటీన్ వైపు నడవడం మొదలు పెట్టాను.

జగదీష్ ప్రతి వ్యక్తి గురించి ఏదో ఒక సూత్రంప్రతిపాదిస్తాడు. అది అలాగే జరిగి తీరుతుంది అని ఢంకాపధంగా చెబ్తాడు. అది ఖచ్చితంగా జరగదు. జరిగే అవకాశం ఉండకపోవచ్చు అన్న విషయాన్ని అసలు భరించలేడు. ఆడవాళ్ళంటే ఎంత ఇష్టమో అంత భయం! నన్ను వైజయంతిగా గుర్తుపెట్టుకునే అందరి సమక్షంలో 'విజ్జు' అనే పిలుస్తాడు. ప్రతి చిన్న విషయానికి సాయం చేస్తాడు అలా అందరి దగ్గర పేరుంది. కానీ ఏదో ఒక విషయంలో ప్రతి ఒక్కరికీ చికాకు కలిగిస్తాడు. స్నేహితుడన్నవాడు లేకుండా జీవితాన్ని చేసుకోగల సమర్థుడు. అందుకే ఇలాంటి మాటలు మాట్లాడినప్పుడల్లా నేను జగదీష్ గురించి ఎక్కువ ఆలోచిస్తాను, అవతల వాళ్ళకంటే. ఆ రాత్రి ఒక పుస్తకం చదువుతూ చిన్న నిర్ణయం తీసుకున్నాను.

"నువ్వు చెప్పింది నిజమే, రవి, రేఖ విడిపోయేలా ఉన్నారు." గొంతు తగ్గించి అన్నాను.

నమ్మలేనట్టు చూశాడు జగదీష్!

"మీ కెలా తెలుసు?"

"ఎలా తెలిసేదేముంది? నీకెలా తెలిసింతో, అలాగే".

"ఛ, నేన్నమ్మలేను" జగదీష్ మళ్ళీ అన్నాడు.

"అదేమిటి? నిన్నటి వరకు నువ్వన్న మాట ఈ రోజు నేనంటే నమ్మలేవా"?

"అలాక్కాదు. వాళ్ళిద్దరూ పెళ్ళి గురించి ఆలోచిస్తూ ఉండి ఉండాలే!"


"అలాగా! నేను పొద్దున చూసినప్పుడు రవి సైకిల్ తొక్కుకుంటూ అటువైపు వెళ్ళిపోయాడు. రేఖ ఇటు డిస్పెన్సరీ వైపు నడుస్తోంది".

"వాళ్ళిద్దరూ కలిసి మాట్లాడి వెళ్ళిపోయింతర్వాత చూశావేమో!"

"అంతేనంటావా?"

"అంతే .... రేఖ చాలా మంచిది, విజ్జూ. రవి పొరపాటు చేసినా క్షమించి, సహిస్తుంది. రవి కూడా .... అంత చెడ్డవాడు కాదనుకుంట. ఏదో పరధ్యానంగా ఉంటాడు గానీ ..... ఏమైనా వాళ్ళిద్దరూ మాత్రం విడిపోకూడదు."

☆ ☆ ☆




నేను ముందుగా ఒక మాట చెప్పడం మరిచేపోయాను. జగదీష్, నేనూ ఖండించుకుంటూ పెరిగే స్నేహితులం. ఒకోసారి జగదీష్ని తను ఈదుతున్న నీళ్ళలోంచి బయట పడెయ్యాలి. ఆ రెండు క్షణాల్లో చచ్చిపోడుగానీ, మళ్ళీ నీళ్ళలోకి పడేసిం తర్వాత ఈ క్షణాలను గుర్తుంచు కుంటాడు. రవి అన్న మాటలు గుర్తు తెచ్చుకుంటూ అనుకున్నాను - ఈ అనుభవం విలువైన దొతుందని.

మా ఇద్దరికీ ఇష్టమున్నా, లేకపోయినా రవి, రేఖ కలిసి బ్రతుకుతున్నారు. పెళ్ళి చేసుకున్నారో లేదో తెలీదు. అది జగదీష్కి మరోసారికి ఉపయోగపడుతుంది !.

☆

## మాటల ఆట- 15

ఆధారాలు - నిలువు :

1. మత్తు గమ్మత్తుగా పాతమాయా బజార్ సినిమాలో ఓ పాటకు ముందెత్తున ఉంది.
2. కన్నీరు సంద్రమయ్యింది.
3. అందరేసి పిల్లల్ని కనేరోజులు కావివి.
4. మోటార్లు లేనప్పుడు మోటతోలటమే.
5. తప్పెట అంటే టముకు కాదు.
9. కాగితాలకు ఒక కొలమానం.
11. ఏమీలేని దానికి తిరగబడటం దేనికో?!
12. ఒకరాగం.
13. అకస్మాత్తుగా.
14. ఇంగ్లీషు చువ్వలులాగున్నా తెలుగులో గుంజలే.
15. క్రింది నుండి పైకొచ్చిన ఉపాధ్యాయుడు.
16. గ్రామాలకు వెళ్ళే ఆర్టీసీ బస్సు ముక్కలయ్యింది.
20. పిశాచం తిరగబడితే రగడే!
22. ముళ్లపూడి లిటిల్ హీరో చెల్లా చెదరయ్యాడు.

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | ■ | 3 | | 4 | ■ | 5 |
| | ■ | 6 | | | ■ | 7 | | |
| 8 | 9 | | ■ | 10 | 11 | | ■ | |
| ■ | | ■ | ■ | ■ | | ■ | ■ | ■ |
| 12 | | 13 | ■ | 14 | | 15 | ■ | 16 |
| | ■ | 17 | | | ■ | 18 | | |
| 19 | 20 | | ■ | 21 | 22 | | ■ | |
| ■ | | ■ | ■ | ■ | | ■ | ■ | ■ |
| 23 | | | ■ | 24 | | | ■ | 25 |

• ఆల్ కరక్ట్గా వ్రాసినవారికి బహుమతి. ఒక్క తప్పుకూడా లేకుండా ఈ పజిల్ని పూర్తిచేయండి. రూ.25॥ లు గెల్చుకోండి..

ఆధారాలు - అడ్డము

1. నృత్యము మరో విధంగా.
3. గులకరాయికి సంస్కృతం.
6. అన్నలలో పెద్దవాడు. అయినా తిరగబడ్డాడు.
8. వరుసగా 'ర' గుణింతంలో అక్షరాలు
10. తిరగబడితేనేంలెక్కపెట్టు.
12. పక్షికి కూడ అరుసున్నా ఎందుకులే!
14. గ్రహణము
17. అటువంటి మాట వినకూడదని ఆ మాటే తిరగబడింది.
18. రుద్రుని భార్య.
19. సంపాదన
21. ఎద్దుమెడలో కట్టే ఒకరకం గంట.
23. పట్టణము.
24. సాహసము.
25. ఒక్క అక్షరంతో ఇంగ్లీషులో అయితే ఎంత చక్కగా వెళ్లిపోవచ్చు.